**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్‌ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 11-10-2025 | సంపుటి: 11 | సంచిక: 240 | పేజీలు: 8 | వెల: రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## నందగోకులంలో చంద్రబాబు పర్యటన.. లైఫ్ స్కూల్ ప్రారంభం



నెల్లూరు: సమాజంలో పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా ఈదగాలిలో విశ్వసముద్ర గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించిన నందగోకులం లైఫ్ స్కూల్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి.. కంప్యూటర్ ల్యాబ్ లో విద్యార్థులతో ముచ్చటించారు సీఎం. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను సందర్శించారు. అలాగే.. విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్ట్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.

**ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదు..**

నందగోకులంలో పశువుల పరిరక్షణ, లైఫ్ స్కూల్, ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించడం తనకు కొత్త ఎక్స్‌పీరియన్స్ అని చంద్రబాబు తెలిపారు. 15,000 టన్నుల ధాన్యం నూకలతో ఇథనాల్ తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకి ఆదాయం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణకి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలని అందిపుచ్చుకున్నారని చెప్పారు. ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదని చెప్పారు. పవర్ ఆఫ్ బుల్స్ చాటుతూ.. 5 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారని చంద్రబాబు వివరించారు.

**సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైంది..**

నందగోకులం సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైందని చంద్రబాబు గుర్తు చేశారు. నందగోకులం లైఫ్ స్కూల్లో పేద పిల్లలకి చదువులు చెబుతున్నారని చెప్పారు. సామాన్య పిల్లలని అనితరసాధ్య వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజం వల్ల పైకొచ్చిన వారు సమాజానికి డబ్బు ఇవ్వడం కాదు. పిల్లలకి అన్ని సదుపాయాలు కల్పించి, బెస్ట్ సిటిజన్స్‌లా తయారు చేయాలని ఆయన సూచించారు.

**విశాఖలో రూ.87వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్..**

ఖ4 మోడల్లో చింతా శశిధర్ ఫౌండేషన్ ది బెస్ట్ స్కూల్ నడుపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. దగదర్తిలో ఎయిర్ పోర్టు, కృష్ణపట్నంకి సీ పోర్టు, నేషనల్ హైవే, రైల్వే కనెక్టవిటీలు వస్తాయని స్పష్టం చేశారు. 2047లో ప్రపంచంలోనే మనదేశం ఒక శక్తిగా ఎదగబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అందులో మన ఏపీ మరింత శక్తిగా ఎదుగుతుందని వివరించారు. విశాఖలో రూ.87వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్ రాబోతుందని చెప్పారు. పేదలని బయటకి తీసుకువచ్చే బాధ్యత అందరూ తీసుకోవాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కేబినెట్ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంపై మంత్రి మాట్లాడారు. ఇవాళ జరిగిన క్యాబినెట్ మీటింగ్ రాష్ట్ర ఆర్థిక పురోగతి, ఏఐ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ఐపీబీ మీటింగ్‌లో చర్చించిన నిర్ణయాలకూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు స్పష్టం చేశారు. గడిచిన 15 నెలల కాలంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సుకు అనేక పాలసీలు ఇచ్చామని కొలుసు పార్థసారథి తెలిపారు. వివిధ పాలసీలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇచ్చి రూ.1.17లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సుమారు 70 వేల ఉద్యోగాలు వచ్చేలా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే టాటా పవర్ రెన్యూవబుల్ లిమిటెడ్ ప్లాంటు, చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తోటపల్లి బ్యారేజి నుంచి 24 ఎంసీఎం నీటిని ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీనితో పాటు ఎవాపరేషన్ లాసెస్‌కూ నీటిని కేటాయించినట్లు తెలిపారు. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్‌ల కింద కర్నూలు జిల్లాలో రూ.758 కోట్లతో ప్యాక్టరీ నెలకొల్పడానికి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 500 మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. టూరిజం పాలసీ ఒక గేమ్ ఛేంజర్ అందుకే దానిపై కేబినెట్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. దాని కోసం ప్రత్యేకమైన ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేయలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు

## వైద్య విద్యలో పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యం..




అమరావతి: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం వెళ్లి గోడలు, ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు చూసి వచ్చారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. వాటిని చూసి ఆహా.. ఓహో.. అంటూ ప్రజల్ని మోసం చేసే విధంగా డ్రామాలు ఆడారని ఆరోపించారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్‌కి అమ్మేయడం కాదు.. పనుల్లో ప్రైవేట్ సహకారం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కాలేజీల నియంత్రణ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. వైద్య విద్యలో నాణ్యత పెంచడం, పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రతి మెడికల్ కాలేజీలో 50% సీట్లు పేద విద్యార్థులకే కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే.. పేద విద్యార్థులకు అదే కేటాగిరి కింద రూ.15 వేల కేటాయించబడతాయని చెప్పారు. పీపీపీ పద్ధతిని నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ సేట్ సమర్థించారని గుర్తు చేశారు. వైద్య విద్యను ముందుకు తీసుకువెళ్లాలంటే

## మానసిక ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం..

**సమష్టి భాగస్వామ్యంతో ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులేద్దాం**
**టెలీ మానస్ ద్వారా అత్యంత నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు**
**దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో సేవలు**
**మానసిక సమస్యలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స**
**మానసిక ఆరోగ్య రంగంలో ఇండ్లాస్ సేవలు ప్రశంసనీయం**
**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

విజయవాడ,అక్టోబర్ 10: మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషిచేద్దామని.. దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మానసిక ఆరోగ్యానికి భరోసా కల్పించే వివిధ కార్యక్రమాలతో పాటు వైద్య సేవలు అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో ఇండ్లాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మంత్రి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులతో కలిసి 'మెంటల్ హెల్త్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది వివిధ రకాల మానసిక రుగ్మతలకు గురైనట్లు వెల్లడించారు. మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు ఏటా ట్రిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లుతోందన్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యల బారినపడుతున్నారని.. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో 14-24 శాతం మంది గురవుతున్నట్లు తెలిపారు. మానసిక రుగ్మతలు, ఒత్తిళ్ల వల్ల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. సమాజానికి వెలకట్టలేని వైద్యసేవలందిస్తున్న మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొరత వుందని, ఆ కొరత తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని.. ఇండ్లాస్ హాస్పిటల్‌లో క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభమైనట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో లేని విధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో టెలీ మానస్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతి జిల్లాలోనూ మెంటల్ హెల్త్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. దేశ వ్యాప్తంగా 27 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఇస్తే మన రాష్ట్రానికి ఒక కేంద్రం వచ్చిందని, విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా అప్‌గ్రేడ్ అయిందన్నారు. మానసిక ఆరోగ్య రంగంలో నిపుణుల కొరత తీర్చేందుకు కోర్సులు, ప్రవేశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో మానసిక రుగ్మతలను గుర్తించి.. సరైన చికిత్స అందించడం ముఖ్యమని, ఈ దిశగా సమష్టి



కృషి, భాగస్వామ్యం అవసరమని, మానసిక వైద్య రంగంలో డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి చేస్తున్న కృషిని అభినందిస్తున్నామని, ఆయన అనుభవాన్ని, సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## దగ్గు మందు మరణాలపై సీబీఐ దర్యాప్తు జరపాలని పిల్.. తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో దగ్గు మందు కారణంగా చిన్నారులు మృతి చెందారని.. ఈ అంశంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన ప్రజప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. మొదట ధర్మాసనం నోటీసులు జారీ చేసేందుకు అంగీకరించినప్పటికీ.. కేసును పరిశీలించిన తర్వాత పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యూస్‌పేపర్లు చదివిన తర్వాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయిస్తున్నారంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పిటిషన్‌ను వ్యతిరేకించారు. తాను ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం లేదని.. కానీ తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్రమైన చర్యలు తీసుకున్నాయని, వాటిని విస్మరించలేమని మెహతా కోర్టుకు తెలిపారు. డ్రగ్స్ చట్టాలను అమలు చేసేందుకు తగిన వ్యవస్థలు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో ఇప్పటివరకు ఎన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారని పిటిషనర్ తివారీని ధర్మాసనం ప్రశ్నించింది. తాను ఎనిమిది నుంచి పది పిల్స్ పిటిషన్లను దాఖలు చేశానని తివారీ సమాధానం ఇవ్వగా.. ధర్మాసనం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. నాసిరకం మందులు మార్కెట్‌కు చేరకుండా తొలుత నాణ్యత పరీక్షా వ్యవస్థల్లోని లోపాలను దర్యాప్తు చేయాలని.. ఈ విషయంలో కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో న్యాయవాది తివారీ కోరారు.

## జీఎస్టీ సంస్కరణలతో వైద్యరంగంలో విప్లవం

**ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం: కలెక్టర్**

విజయవాడ, అక్టోబర్ 10: ముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని.. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌తో సామాన్యుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సూపర్ జీఎస్టీ 2.0తో వివిధ రంగాల్లో భారం తగ్గిందని.. జీవిత బీమాపై పాత రేటు 18 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందని, ఆరోగ్య-కుటుంబ బీమాలోనూ ఇదే రకమైన మినహాయింపు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లుపై 12 శాతం ఉన్న పన్ను 5 శాతానికి తగ్గిందన్నారు. ఈ సంస్కరణలతో జరుగుతున్న మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, రైతు సేవా కేంద్రాలు, అంగన్వాడీలు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిచోటా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఆదా అయిన సొమ్ము ప్రజల జీవితాలకు కొత్త దిశను చూపిస్తాయని, ఈ డబ్బు పెట్టుబడి కోసం, చదువుకోసం, డిపాజిట్ల కోసం.. ఇలా వివిధ రకాలుగా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కొత్త జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు దాదాపు రూ. 300 కోట్లు మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇంత మంచి అవగాహన కార్యక్రమంలో భాగస్వాములైన జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు, డయాగ్నిస్టిక్ట్ కేంద్రాలు.. ఇలా ప్రతిచోటా కొత్త జీఎస్టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాలకు సంబంధించి అధిక ప్రయోజనాలు సామాన్యులకు చేరువవుతున్నాయన్నారు. జీవిత బీమాలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభిస్తుందని, ఆరోగ్య కుటుంబ బీమాలో ప్రతి రెన్యువల్‌లోనూ 18 శాతం ఆదా అవుతుందని వివరించారు. చికిత్సా ఖర్చులు, పరీక్షల ఖర్చులూ తగ్గుతాయని వెల్లడించారు.

## కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం

ఢిల్లీ, అక్టోబర్ 10: ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు రెండు దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం మళ్లీ తెరుస్తామని ఈ సందర్భంగా జైశంకర్ ప్రకటించారు. ఉగ్రవాదాన్ని ఏరివేసేందుకు ఇరు దేశాలు కలిసి పోరాటం చేస్తాయని ఇరుదేశ విదేశాంగ నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించిన జైశంకర్.. సీమాంతర ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న కొన్ని దేశాలకు త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. భారతదేశ భద్రతా సమస్యల పట్ల ఆఫ్ఘనిస్థాన్ చూపిస్తున్న సున్నితత్వాన్ని, సంఘీభావాన్ని భారత్ అభినందిస్తుందని జైశంకర్ పేర్కొన్నారు. ఇక, ఆఫ్ఘనిస్థాన్ ఎక్సలెన్సీ, వృద్ధి, శ్రేయస్సు పట్ల తమ దేశానికి నిబద్ధత ఉందని జైశంకర్ తెలిపారు. అయితే, రెండు దేశాలు ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదపు ఉమ్మడి ముప్పు వల్ల ఇవి ప్రమాదంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. అలాగే, ఆఫ్ఘనిస్తాన్ స్థిరత్వానికి భారతదేశం దీర్ఘకాలంగా మద్దతు ఇస్తుందని జైశంకర్ హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్తాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతతో పాటు ఆ దేశ స్వాతంత్ర్యానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

# నోరు జారుతున్న మంత్రులు

హైదరాబాద్, అక్టోబరు 10, తెలంగాణ మంత్రుల మాటలు మంటలు రేపుతున్నాయి. పరుష పదజాలంతోనూ, అనాలోచితంగా చేసే వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఈ తరహా వ్యాఖ్యలు మంత్రుల మధ్య విబేధాలు సృష్టిస్తుంటే, ఇక ముఖ్యమంత్రి (సీఎం) చేసిన వ్యాఖ్యలను ఏకంగా సుప్రీంకోర్టే తప్పుబట్టింది. అందుకే నాలుకను 'రెండు అంచుల ఖడ్గం'గా చెబుతారు. అది పక్క పార్టీ వాళ్లనే కాదు, సొంత పార్టీ వాళ్లను కూడా ఖండించేయగల శక్తిగలది. అయితే, తెలంగాణలో ఈ మాటలు రేపుతున్న చిచ్చు ఏంటో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మధ్య మాటల యుద్ధానికి తెరలేచింది. అయితే, ఆ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చిన తనను పొన్నం ఒక జంతువుతో పోల్చి అమర్యాదగా మాట్లాడారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పొన్నం తీరుపై మండిపడ్డారు. అయితే, తాను అడ్లూరిని ఏమీ అనలేదని, ఢిల్లీ పర్యటనకు టికెట్ బుక్ చేయని తన సిబ్బందిని ప్రస్తావిస్తూ ఆ పదం వాడానని పొన్నం వివరణ ఇచ్చారు.అయితే, ఇది ఇంతటితో ఆగలేదు. మరో మంత్రి వివేక్ కూడా తన పక్కన కూర్చోవడానికి ఇష్టపడడం లేదని, అందుకు కారణం తాను వచ్చిన సామాజిక వర్గమే అని అడ్లూరి హాట్ కామెంట్ చేయడం జరిగింది. ఈ వివాదం చివరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వరకు చేరింది. ఇద్దరూ ఈ విషయాన్ని మరిచిపోయి కలిసి పని చేయాలని ఆయన చెప్పినా, ఈ విషయంలో పొన్నం తనకు క్షమాపణ చెప్పాలని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. అయితే, మంత్రి అయినా, తన సిబ్బంది అయినా ఒక జంతువుతో పోల్చి తిట్టడం మాత్రం అనైతికమని పొన్నం వ్యాఖ్యలను నెటిజన్లు తప్పుబడుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన తొందరపాటు వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక వర్గాల మధ్య వివాదంగా మారాయి. అయితే, దీన్ని హస్తం (కాంగ్రెస్) పెద్దలు ఎలా కట్టడి చేస్తారో వేచి చూడాలి.నాగార్జున సాగర్ పర్యటన కోసం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మరో ఇద్దరు మంత్రులు హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉంది. అయితే, ఉదయం 9 గంటలకు వెళ్లాల్సింది, గంట ఆలస్యంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి రావడంతో ఆగ్రహించిన కోమటిరెడ్డి, బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి వెళ్లిపోయారు. ఇతర మంత్రులు ఫోన్ చేసినా కోమటిరెడ్డి వారి కాల్‌కు ప్రతిస్పందించలేదు. ఇది ఇద్దరి మధ్య బహిరంగ వాగ్వాదానికి దారి తీసింది.ఈ క్రమంలోనే ఉత్తమ్ కుమార్ రెడ్డి, "ప్రభుత్వ వనరులను ఇష్టానుసారం వాడుకోకూడదు. కొందరు అతిగా ప్రవర్తిస్తున్నారు" అంటూ కోమటిరెడ్డిని ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. దీనికి స్పందించిన కోమటిరెడ్డి, "ప్రభుత్వ వనరులను వాడుకునే హక్కు మాకు ఉంది. దీనిపై కొందరు అనవసరంగా రచ్చ చేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఇలా నల్గొండ జిల్లాలోనూ, క్యాబినెట్‌లోనూ ఇద్దరు సీనియర్ మంత్రుల మధ్య ఆధిపత్య పోరుకు ఈ ఘటన నిదర్శనమైంది.రాజకీయ విమర్శల్లో భాగంగా కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో తీవ్ర దుమారం లేపాయి. సినీ నటుడు నాగార్జున, నటి సమంతపై కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో

వారు తీవ్రంగా ప్రతిస్పందించడం జరిగింది. సమంత విడాకులకు కారణం కేటీఆర్ అంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై సినీ పరిశ్రమ కూడా తీవ్ర స్థాయిలో తన ప్రతిస్పందన తెలియజేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుబడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అంతే కాకుండా, కేటీఆర్ దీనిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసులు కూడా పంపడం జరిగింది. ఈ క్రమంలో, తన వ్యాఖ్యలను కొండా సురేఖ బహిరంగంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఈ వివాదం తొందరపాటు వ్యాఖ్యల ఫలితంగా చెప్పవచ్చు.మంత్రుల మధ్య వివాదాస్పద వ్యాఖ్యలు ఇలా ఉంటే, ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరినా ఉప ఎన్నికలు వచ్చేది లేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ చేస్తోన్న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది.ఈ వ్యాఖ్యలు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం)ను అపహాస్యం చేస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సీఎం వ్యాఖ్యలు చేయకూడదని హితవు పలికింది. సుప్రీంకోర్టు స్పందనతో సీఎం రేవంత్ రెడ్డి తిరిగి అసెంబ్లీలో తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయడం జరిగింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా మాట్లాడకూడదన్న అంశం ఈ వివాదాస్పద వ్యాఖ్యల ద్వారా అర్థం అవుతోంది.విమర్శలు, సూచనలు, అభిప్రాయాలు ఏవైనా తొందరపాటుతనంతో చేస్తే అది పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగిస్తాయనడానికిపై ఉదంతాలు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఇది పాలనపైనా, పార్టీ ఎదుగుదలపైనా ప్రభావం చూపుతోంది. అంతే కాకుండా, కొందరు రాజకీయ నేతల రాజకీయ జీవితాలు సమాప్తమైన ఘటనలు సమకాలీన రాజకీయాల్లోనూ ఉన్నాయి. అందుకే, ఆచి తూచి మాట్లాడిన నేతలకే గౌరవం దక్కుతుంది.

# ప్రత్యామ్నాయాలపై సర్కార్ దృష్టి

హైదరాబాద్, అక్టోబరు 10, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవో నెంబర్ 9 అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం తెలిసిందే. దీంతో, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొంది. జీవో నెంబర్ 9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన ఆప్షన్స్ ఉన్నాయికామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఎం.ఎస్. నెంబర్ 9ని జారీ చేసింది. అయితే, ఈ జీవో అమలుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో, ఇప్పుడు ఆ పార్టీ ముందున్న చట్టపరమైన, రాజకీయపరమైన 'బిగ్ త్రీ' ఆప్షన్స్ ఇవే:ఆప్షన్ 1: సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడంహైకోర్టు జీవో నెంబర్ 9పై విధించిన స్టేను సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ప్రభుత్వానికి ఉన్న తొలి ఆప్షన్. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, విచారణకు వచ్చేలా చూడటం. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియను రిజర్వేషన్లు పెంపు సందర్భంగా పాటించినట్లు చట్టపరంగా నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకుగాను, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణన సర్వే, బీసీ కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ చేసిన అధ్యయనం, సిఫారసులను సుప్రీంకోర్టు ముందు ఉంచడం ద్వారా, తమకు అనుకూలంగా అంటే జీవో నెంబర్ 9పై స్టేను ఎత్తివేసేలా చేయడం మొదటి ఆప్షన్‌గా చెప్పవచ్చు.ఆప్షన్ 2: పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడంహైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలనుకుంటే,

## కిం కర్తవ్యం

పాత రిజర్వేషన్లనే అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియలో ముందుకు సాగడం రెండో ఆప్షన్. లేదా ప్రభుత్వం దీనిపై సుప్రీంలో పిటిషన్ వేయకపోయినా, ఒకవేళ పిటిషన్ వేసినప్పటికీ జీవో నెంబర్ 9పై స్టే ఎత్తివేయకపోతే ఉన్న మరో ఆప్షన్... 42 శాతం రిజర్వేషన్లు బదులు, పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించడం. అప్పుడు ఈ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంటే 50 శాతం లోపు ఉండటం వల్ల లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీనివల్ల హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే కాకుండా, కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు నిధులు అందే అవకాశం ఉంది. అయితే, ఈ ఆప్షన్ ప్రకరం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే, ప్రతిపక్షాలు, బీసీ సంఘాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది.ఆప్షన్ 3: గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడంగవర్నర్ ఆమోదం లేకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో నెంబర్ 9ను జారీ చేయడంపై హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఈ జీవోకు చట్టబద్ధ సవరణ చేయడం మరో ఆప్షన్ గా చెప్పవచ్చు. అంటే, బీసీ రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా ఆమోదింపజేయడం, హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం ఈ ఆప్షన్‌లో భాగంగా చెప్పవచ్చు. జీవో ద్వారా కాకుండా శాసనసభ చేసిన చట్టం ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే చట్టపరమైన రక్షణ ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొంత సమయం పట్టినా, ఈ ప్రక్రియ ద్వారా అనుకున్న రీతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రయత్నించడం సరైన ప్రక్రియ. అయితే, చట్టసభలో ఆమోది ంచిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం అన్నది తెలంగాణ సర్కార్ చేతుల్లో లేని పని. ఈ ఆప్షన్ ఎంతవ రకు సక్సెస్ అవుతుందనడం మాత్రం సందేహాస్పదమే.అయితే, ఈ మూడు ఆప్షన్స్ కూడా సులువుగా ఎంచుకుని అమలు చేసే పరిస్థితి అయితే లేదు. కాకపోతే, సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశాలు మాత్రం మెండుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అన్నది కాంగ్రెస్ సర్కార్‌కు కేవలం చట్టపరమైన సవాల్ మాత్రమే కాదు. కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయడం, బీసీల పట్ల తమ చిత్తశుద్ధి ప్రదర్శనకు కీలకం. బీసీ వర్గాల మద్దతు నిలుపుకోవడం ప్రధానం. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తుందన్నది మాత్రం తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# కొలువుల జాతర

హైదరాబాద్, అక్టోబరు 10, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం ఇస్తోంది. గడిచిన ఏడాదిన్నర పాలనలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసింది. అయితే దాని ప్రకారం నోటిఫకేషన్లు రావడం లేదు. ఈ తరుణంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. సర్కార్ రెండు ఏళ్ల పాలన పూర్తి కాబోతున్న వేళ, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయడానికి తెలంగాణప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే రెండు నెలల్లో సుమారు 25 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు సమాచారం.

పోలీస్ విభాగానికే ప్రధాన ప్రాధాన్యత

డీజీపీ శివధర్ రెడ్డి ప్రకారం, పోలీస్ శాఖలో దాదాపు 17,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్, టెక్నికల్ సిబ్బంది, కమ్యూనికేషన్ విభాగం తదితర విభాగాలకు ఈ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

అంతేకాదు, ఆధునిక పోలీసింగ్ సదుపాయాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు.

విద్యా రంగంలో కొత్త అవకాశాలు

టీచర్ రిక్రూట్‌మెంట్ (డీఎస్సీ)తో పాటు డైట్, డిప్యూటీ డీఈవో, బీఈడీ కాలేజీ లెక్చరర్లు, ఎస్‌ఈఆర్టీ పోస్టుల కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో ఖాళీలు తగ్గించడంతోపాటు, నాణ్యతను మెరుగుపర్చే దిశగా ఈ నియామకాలు కీలకంగా మారే అవకాశం ఉంది.

గ్రూప్ సేవల నోటిఫికేషన్లు సన్నాహాల్లో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్?1, గ్రూప్?2, గ్రూప్?3, గ్రూప్?4 నోటిఫికేషన్లకు కూడా తుది దశలో సన్నాహాలు పూర్తిచేస్తోంది.

కొత్త సిలబస్, డిజిటల్ పరీక్షా పద్ధతి, పారదర్శక నియామక విధానంపై ఈసారి ప్రత్యేక దృష్టి పెట్టబోతోంది.

అభ్యర్థులకు ఇది చక్కని అవకాశం

ఉద్యోగ నియామకాలు రాజకీయ హామీల సాకార రూపంగా మాత్రమే కాకుండా, నిరుద్యోగ యువతకు పెద్ద ఉపశమనం అవుతాయి.

గత రెండేళ్లుగా నిలిచిపోయిన తాత్కాలిక నియామకాలు తిరిగి చోదక శక్తిగా మారవచ్చు.ముఖ్యంగా గ్రాడ్యుయేట్, పీజీ, బీ.ఏడ్ అభ్యర్థులకు విస్తృత అవకాశాలు లభించే అవకాశం ఉంది.

# త్రిశంకు స్వర్గంలో గ్రూప్ వన్ అభ్యర్థులు

హైదరాబాద్, అక్టోబరు 10,గ్రూప్-1కు ఎంపికకాని అభ్యర్థులు, ఇప్పటికే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న గ్రూప్-1 ఉద్యో గులు త్రిశంకు స్వర్గంలో ఉన్న పరిస్థితి నెలకొన్నది. తమకు ఉద్యోగం వస్తుందని కొందరు భావిస్తుంటే.. తమ ఉద్యోగాలు ఉంటయా? లేక ఊడుతాయా? అని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న మరికొందరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.గ్రూప్-1 నియామకాలను నిలిపివేయా లని కొందరు గ్రూప్-1 అభ్యర్థులు ఇటీవల వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం డిస్పోజ్ చేయడంతో హమ్మయ్య అని ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నా, హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది తీర్పుకు లోబడే వారి నియామకాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం గమనార్హం.అంటే అపాయింట్‌మెంట్‌లు తీసుకున్నా ఉద్యోగాలు ఉండొచ్చు.. లేకుంటే ఊడొచ్చునని అభ్యర్థులు చెబుతున్నారు. ఉద్యోగాలు రానివారు, ఉద్యోగాలు వచ్చినవారు.. ఇలా రెండు వర్గాలుగా చీలిపోయిన గ్రూప్-1 అభ్యర్థులు ఎవరికి వారు తమకే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. కానీ, న్యాయస్థానాలు వెలువరించే తీర్పును బట్టే ఎవరికి ఉద్యోగాలొస్తాయి? ఎవరికి పోతాయి? అనేది స్పష్టమవుతుందని అంతా భావిస్తున్నారు.దాదాపు 14 ఏళ్ల తర్వాత గ్రూప్ నియామకాలు జరుగుతున్నాయి. అయితే తొలి నుంచి ఈ నియామకాల ప్రక్రియ వివాదాల చుట్టే తిరుగుతోంది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న అభ్య ర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా 2022 ఏప్రిల్ 26న 503 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. 2022 అక్టోబర్ 16న ప్రిలిమి నరీ పరీక్షలు నిర్వహించగా, 2023 ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది.ఈలోగా గ్రూప్1తోపాటు పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో గ్రూప్1 పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేసింది. 2023 జూన్ 11న మరోసారి ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను పార దర్శకంగా నిర్వహించలేదని, లోపాలు జరిగాయ ని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పుడు కూడా ఆ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువడింది.ఆతర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడం, టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయడంతో పాటు 503 పోస్టులకు గానూ మరో 60 పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1 నోటిఫికేషన్‌ను వేసింది. 2024 జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేయగా, మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది.అదేవిధంగా ఏప్రిల్ 10న 563 ఉద్యోగాలకు ఎంపికైన గ్రూప్-1 అభ్యర్థుల తుది జాబితా ను విడుదల చేసి ధ్రువపత్రాల పరిశీలనను కూడా చేపట్టింది. అయితే మెయిన్ పరీక్షల్లో అవకతవకులు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో గ్రూప్ మెయిన్ పరీక్షల మార్కులు, ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ ఏడాది సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చింది.అంతేకాకుండా జవాబు పత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని లేదా తిరిగి మెయిన్స్ పరీక్షను ఎనిమిది నెలల్లోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయి తే దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన కొం దరు అభ్యర్థులు, టీజీపీఎస్సీ.. హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లడంతో సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ సెప్టెంబర్ 24న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.ప్రభుత్వం నియామకాలు చేపడితే అవి రిట్ అప్పీళ్ల తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా చెప్పడం గమనార్హం. దీంతో ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆ పిటిషన్‌ను కోర్టు మంగళవారం డిస్పోజ్ చేసింది.

# కార్పొరేషన్ లో పట్టు వయా ఉపఎన్నిక

హైదరాబాద్, అక్టోబరు 10, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అనుసరించాలనుకున్న వ్యూహం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయిందనే సంకేతాలు వెలువడుతున్నాయి. బీజేపీ అభ్యర్థికి తమ మద్దతు ప్రకటించి, తెలంగాణ రాజకీయాల్లో తమ ఉనికిని, నిర్ణయాత్మక శక్తిని చాటుకోవాలని టీడీపీ భావించింది. అయితే, ఊహించని విధంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆ మద్దతును తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తటస్థ వైఖరి అవలంబించాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైనా కూడా బీజేపీ నిరాకరించిందని సమాచారం. ఇందుకు అనేక కారణాలను బీజేపీ వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణలో చంద్రబాబుపై ఉన్న వ్యతిరేకత వల్లే టీడీపీ మద్దతు తీసుకోకూడదని బీజేపీ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలోని ప్రధాన వర్గాల్లో చంద్రబాబుపై బలమైన వ్యతిరేకత ఉన్నట్లు బీజేపీ నాయకత్వం గుర్తించింది. ఈ సమయంలో టీడీపీ మద్దతు తీసుకుంటే, అది ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి నష్టం చేకూరుస్తుందని, ఓటర్లు దూరం జరిగే అవకాశం ఉంటుందని బీజేపీ భావించింది. అందుకే టీడీపీ మద్దతు తమకు అక్కర్లేదని, ఒంటరిగానే బరిలోకి దిగుతామని చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇతరుల మద్దతుపై ఆధారపడకుండా, సొంత బలంతోనే విజయం సాధించాలనే సంకేతాన్ని బీజేపీ ఇవ్వదలుచుకున్నట్లు తెలుస్తోంది.బీజేపీ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రాకపోవడంతో టీడీపీ నాయకత్వం డీలా పడినట్లు సమాచారం. అలాగని ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదు. మంగళవారం ఉండవల్లిలో టీటీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం సందర్భంగా ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. బీజేపీ మద్దతు కోరితే ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని, లేకుంటే తటస్థంగా ఉండాలని పార్టీ కేడర్ కు ఆయన సూచించారు. అలాగే, ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా తెలంగాణలో కూడా ప్రభావం చూపించాలని టీడీపీ భావించింది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కొన్ని సీట్లయినా గెలుచుకోవడం ద్వారా ప్రభావం చూపించాలనని చంద్రబాబు వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. కానీ, బీజేపీ తమ మద్దతును తిరస్కరించడంతో ఆయన వ్యూహం బెడిసికొట్టినట్లయింది.తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీకి దూరంగా ఉంటుందని అధికారికంగా ప్రకటించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయరాదని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పోటీకీ పార్టీ శ్రేణులు సమాయత్తంగా లేరన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉప ఎన్నికల్లో ఏ పార్టీకీ మద్దతు ఇవ్వరాదని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ స్థాయి కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నందున బీజేపీ కోరితే జూబ్లీహిల్స్‌లో మద్దతు విషయం ఆలోచిద్దామని చంద్రబాబు అన్నారు. సమర్థ నాయకత్వాన్ని అందించేవారికే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని తెలంగాణ టీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తిచేసుకుని కార్యక్రమాలు పెంచాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదుగుదాం, ఇందుకోసం సంస్థాగతంగా బలోపేతం కావడం ముఖ్యం. అన్ని స్థాయిల్లో కమిటీలను పూర్తిచేయండి. ఎప్పటికప్పుడు నేను కూడా దిశానిర్దేశం చేస్తా అని చంద్రబాబు అన్నారు.

# అయినా కమలం ఎందుకో వెనుకబడింది

హైదరాబాద్, అక్టోబరు 10, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ ఉపఎన్నికపై ఎక్కువగా ఫోకస్ పెట్టాయి. కానీ భారతీయ జనతా పార్టీమాత్రం ఇప్పటికీ అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహం విషయంలో వెనుకబడింది. ఇది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ కీలక నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని చెబుతున్నప్పటికీ, పార్టీలో నెలకొన్న అంతర్గత సందిగ్ధత, ఆలస్యం పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి.బీజేపీ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించకపోవడానికి ప్రధాన కారణం, రాష్ట్ర నాయకత్వం మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలేనని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని వార్తలు వస్తున్నాయి. ఈ అంతర్గత విభేదాల కారణంగానే జాప్యం జరిగిందని, అందుకే సమస్య పరిష్కారం కోసం హైకమాండ్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసిందని సమాచారం. ఇది పార్టీలోని సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది.మరోవైపు, మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటి జయసుధను బీజేపీ బరిలోకి దించే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. జయసుధ గతంలో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న గ్లామర్, ఎలైట్ వర్గాల ఓటర్లను, అలాగే సినీ అభిమానులను ఆకట్టుకోవడానికి బీజేపీ ఆమె అభ్యర్థిత్వాన్ని ఒక స్ట్రాటజీగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారైతే, అది నిస్సందేహంగా ఎన్నికలకు కొత్త ఫ్లేవర్ తీసుకొస్తుంది. అయితే జయసుధ క్రిస్టియన్ కావడం, ఇటీవలే పార్టీలో చేరడం లాంటివి ఆమెకు మైనస్ కావచ్చు. ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడం, హిందూత్వ నినాదాన్ని తీసుకెళ్లే అవకాశం ఉండకపోవడం లాంటివి జయసుధ అభ్యర్థిత్వాన్ని వెనక్కు నెట్టవచ్చు.బీజేపీ ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో కనిపిస్తోంది. అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం ద్వారా, చివరి నిమిషంలో ప్రచార పదును పెంచి, ప్రత్యర్థులు వ్యూహాలు మార్చుకోవడానికి సమయం లేకుండా చేయాలని భావిస్తూ ఉండొచ్చు. అయితే, అభ్యర్థి ఎంపిక విషయంలో అంతర్గత సమస్యే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు, వారి సామాజిక సమీకరణాలను బేరీజు వేసిన తర్వాత, అత్యంత బలమైన లేదా అత్యంత ప్రభావవంతమైన అభ్యర్థిని ఎంపిక చేయాలని బీజేపీ చూస్తుంది. జూబ్లీహిల్స్ పరిధిలోని ఓటరు వైవిధ్యాన్ని పరిగణలోకి తీసుకుని, జయసుధ లాంటి బలమైన గ్లామర్ అస్త్రాన్ని ఉపయోగించాలనుకోవచ్చు.అయితే అభ్యర్థి ఖరారులో జరుగుతున్న ఈ జాప్యం, బీజేపీకి ప్రతికూల అంశంగా మారే అవకాశం ఉంది. ప్రచారం కోసం సమయం తక్కువగా ఉంటుంది. అయితే, జయసుధ లాంటి సెలబ్రిటీని బరిలోకి దింపితే, ఆలస్యాన్ని అధిగమించి, ప్రజల్లో త్వరగా పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మొత్తం మీద, ఉపఎన్నికలో సత్తా చాటాలంటే, బీజేపీ వెంటనే అంతర్గత సమస్యలను పరిష్కరించుకుని, వ్యూహాత్మకంగా అభ్యర్థిని ప్రకటించి, ప్రచారాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

# సంక్రాంతి నాటికి డీఎస్సీ...

విజయవాడ, అక్టోబరు 10,ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డీఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డిఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డిఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ, స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలు పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజే?శారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యాచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్‌పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలను సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాది? ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొ?న్నారు. నేరాల్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలంటే.. పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందుకోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీసెస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం.. ఇప్పుడు 42 ఏళ్ల వరకు కూడా ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు.యూనిఫాం పోస్టులకు రెండేళ్ల వయోపరిమితి పెంచింది. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనున్నట్లు తెలిపింది. ఏపీపీఎస్సీ, ఇతర నియామక సంస్థల ద్వారా జరిగే నియామకాలకు ఇది వర్తిస్తుందని సర్కార్ పేర్కొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. అందులో ముఖ్యంగా, వయసు కారణంగా ఉగ్యోగాల అనర్హులుగా ఉన్నవారు.. ఈ వయోపరిమితి పెంపుతో మళ్లీ దరఖాస్తు చేసుకో వచ్చు. అలాంటి వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని చెప్పాలి.

# వైసీపికి కొత్త వ్యూహాకర్తలు



విజయవాడ, అక్టోబరు 10, 2024 ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత, జగన్ ఇప్పుడు పూర్తిగా కొత్త దిశలో ఆలోచిస్తూ, పార్టీ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, ప్రజల మధ్య తిరిగి విశ్వాసం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా ఆయన కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది.తాజా సమాచారం ప్రకారం, జగన్ తన పార్టీకి కొత్త వ్యూహకర్తను నియమించే నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఐ-ప్యాక్ బృందంలో ప్రశాంత్ కిశోర్ తో కలిసి పనిచేసిన ఒక అనుభవజ్ఞుడు ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నాడు. ఈ ఒప్పందం 2029 ఎన్నికల వరకు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. 2019లో ప్రశాంత్ కిశోర్ సూచనలతో భారీ విజయం సాధించిన జగన్, ఇప్పుడు అదే అనుభవాన్ని మరో వ్యూహకర్త ద్వారా వినియోగించుకోవాలని భావిస్తున్నారు.జగన్ దృష్టి ఇప్పుడు పూర్తిగా పార్టీ కేడర్ బలోపేతంపైనే ఉంది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో ప్రత్యక్షంగా కలుసుకోవడం, నాయకుల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కొత్త వ్యూహం కింద, ఆయన త్వరలో ప్రజల్లోకి వెళ్లే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలముందు ఎండగట్టే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పీపీపీవిధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై జగన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.ఇదే సమయంలో అధికార కూటమి కూడా తన వ్యూహాలను మరింత బలంగా మలుచుకుంటోంది. ప్రశాంత్ కిశోర్, రాబిన్ శర్మ వంటి వ్యూహకర్తలు టీడీపీ?జనసేన?బీజేపీ కూటమికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. దీంతో జగన్ కొత్త వ్యూహకర్త, కూటమి వ్యూహకర్తల మధ్య ఆలోచనా పోరు ఆసక్తికరంగా మారనుంది.ఈ చర్యలన్నీ 2029 సార్వత్రిక ఎన్నికల దిశగా జగన్ తీసుకుంటున్న సన్నాహక క్రమంలో భాగంగా కనిపిస్తున్నాయి. పార్టీ పునరుత్థానం కోసం తీసుకుంటున్న ఈ వ్యూహాత్మక అడుగులు విజయవంతమైతే, రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో పెద్ద మార్పులు చోటుచేసుకోవచ్చు. ప్రజల్లో తిరిగి పట్టు సాధించడం, వైఎస్ఆర్‌సీపీకి నూతన ఉత్సాహాన్ని నింపడం జగన్ ప్రధాన లక్ష్యం. రాబోయే నెలల్లో ఆయన నిర్ణయాలు, కొత్త వ్యూహకర్త సూచనలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీసే అవకాశం ఉంది.మరో వైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. రుషిరాజ్ సింగ్ నేతృత్వంలోని ఈ బృందం వైసీపీకి ఎన్నికల వ్యూహాన్ని.. రాజకీయ సలహాలను అందిస్తూ వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. దాని వెనుక ఐప్యాక్ టీం ఫెయిల్యూర్ ఉన్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేశారు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఐప్యాక్ టీం కు గుడ్ బై చెబుతారని ప్రచారం నడిచింది. కానీ ఇప్పటికీ ఐ ప్యాక్ టీం సేవలే కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఐప్యాక్ బృందం నాయకత్వం మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. రిషి రాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ ప్రధాన సన్నిహితుడు రానున్నట్లు టాక్ నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో ప్రశాంత్ కిషోర్ కు విడదీయరాని బంధం. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ముంగిట వరకు వచ్చి ఆగిపోయింది. 67 సీట్లతో సరిపెట్టుకుంది. ఈ తరుణంలో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల వ్యూహకర్త కోసం అన్వేషించారు. ఎన్నికల వ్యూహంలో ఆరితేరిన ప్రశాంత్ కిషోర్ ను వ్యూహకర్తగా పెట్టుకున్నారు. 2018లో పాదయాత్ర సమయంలోనే పార్టీ శ్రేణులకు స్వయంగా పరిచయం చేశారు ప్రశాంత్ కిషోర్ ను జగన్మోహన్ రెడ్డి. అది మొదలు 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించే వరకు వారి జర్నీ కొనసాగింది. కానీ అకస్మాత్తుగా ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగా మారిపోయారు ప్రశాంత్ కిషోర్. అయినా సరే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి గౌరవ సలహాలు, సూచనలు అందించారు ప్రశాంత్ కిషోర్.ప్రస్తుతం బీహార్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు ప్రశాంత్ కిషోర్. మొన్న ఆ మధ్యన మంత్రి నారా లోకేష్ ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రశాంత్ కిషోర్ తో చర్చించారు. పలు అంశాలపై వారిద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్లో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రశాంత్ కిషోర్ ను ఆశ్రయిస్తే.. తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నానని.. తరువాత చూద్దామంటూ దాటవేత ధోరణి చూపించినట్లు తెలుస్తోంది. అయితే రుషిరాజ్ సింగ్ స్థానంలో ప్రశాంత్ కిషోర్ వేరే వ్యక్తి పేరును సూచించినట్లు సమాచారం. త్వరలో ఆయన ఐప్యాక్ బృందానికి సారథ్యం వహిస్తారని కూడా ప్రచారం నడుస్తోంది. దీనిపై త్వరలో క్లారిటీ రానున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## పవన్ నోట నిరాశజనకంగా మాటలు

కాకినాడ, అక్టోబరు 10, (న్యూస్ పల్స్) కొద్దీ రోజుల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం లోని ఉప్పాడ ప్రాంతంలో మత్స్యకారులు సముద్రపు నీరు ఫ్యాక్టరీల కారణంగా కలుషితం అవుతున్నాయని, చేపలు విషపూరితంగా మారిపోతున్నాయని, దీనిపై స్పష్టమైన విచారణ చేపట్టి, చర్యలు తీసుకోకపోతే మేము అసలు చేపలు పట్టడానికే వెళ్ళమని, పవన్ కళ్యాణ్ వచ్చి మాట్లాడాలి అంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపిన వీడియోలను మనమంతా చూసాము. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ వెంటనే సమీక్ష నిర్వహించి, నేడు కాకినాడ జిల్లాలో పర్యటించి, ఉప్పాడ లో బహిరంగ సభని ఏర్పాటు చేసి అక్కడి మత్స్యకారులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన వాగ్దానాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ మాట ఇచ్చాడంటే, చేసి తీరుతాడు అంతే అంటూ ఈ వీడియోలను చూసిన ప్రతీ ఒక్కరు కామెంట్స్ చేస్తున్నారు.ఆయన మాట్లాడుతూ 'ఈరోజు ఉదయం కాకినాడ కలెక్టర్ గారితో ఈ సమస్య గురించి మాట్లాడాను. దాదాపుగా వంద మంది యువకుల నుండి ఏమి జరుగుతుందో తెలుసుకున్నాను. ఇది ఒక్క రోజులో తీరిపోయే సమస్య కాదు, కాబట్టి నాకు ఒక మూడు నెలలు సమయం ఇవ్వండి. దీని పరిష్కార మార్గం వెతుకుతాను, ఒక చక్కటి రూట్ మ్యాప్ తో మీ ముందుకొస్తాను, ఈ విషయం పై క్యాబినెట్ లో చర్చించడమే కాదు, అవసరమైతే అసెంబ్లీ లో కూడా చర్చిస్తాను. కాస్త సమయం ఇవ్వండి' అంటూ చెప్పుకొచ్చాడు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఉప్పాడ సముద్ర తీరం చుట్టూ రేటెన్షన్ వాల్ కట్టించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాకపోతే ఈ వాల్ కోసం 350 కోట్ల రూపాయిలు కేంద్రం నుండి విడుదల అవ్వాలి. ఇప్పటికే రెండు సార్లు దీనిపై చర్చించారు, రేపు మూడవసారి చర్చించబోతున్నారు'.'కేంద్రం ఆమోదం అయితే తెలిపింది కానీ, 250 కోట్లు ఇవ్వాలా?, లేకపోతే 350 కోట్లు ఇవ్వాల్సిందేనా అనే విషయం పై మాత్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## బీజేపీలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ

తిరుపతి, అక్టోబరు 10, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కుటుంబం గుడ్ బై చెబుతుందా? కమలం గూటికి చేరుతుందా? బిజెపిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి ఎదురయిందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు దీని పైనే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబం ఇప్పుడు కేసుల్లో చిక్కుకుంది. వాటి నుంచి బయటపడాలంటే అధికార పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గం. ఆపై సొంత పార్టీ అధినేత నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో.. ఆ కుటుంబం బిజెపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఇంతకీ ఆ ఫ్యామిలీ ఏదంటే పెద్దిరెడ్డి. ఇటీవల పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చారు. అయితే అదే మిధున్ రెడ్డిని ఇప్పుడు కేంద్రం ఐక్యరాజ్యసమితి సమావేశాలకు పంపిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.కూటమి( అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన నేతలకు కేసుల ఇబ్బందులు తప్పడం లేదు. చివరకు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిని సైతం విడిచిపెట్టలేదు. ఈ పరిస్థితుల్లో రాయలసీమను తన ఆధీనంలో ఉంచుకొని పాలించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయనపై రకరకాల కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు.. మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రెండు నెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఇటీవల ఆయనకు బెయిల్ లభించింది.అయితే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదు. బెయిల్ పై బయటకు వచ్చిన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపి ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నదానిపై జగన్మోహన్ రెడ్డి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ సమయంలోనే టిడిపి తో పెద్దిరెడ్డి కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు కూడా బయటపడ్డాయి. అటు తరువాత ఆ వివాదం ముగిసింది. అయితే అసెంబ్లీకి వైసిపి ఎమ్మెల్యేల హాజరు విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లీడ్ తీసుకోవాలని జగన్ సూచించారు. అందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పుకోలేదు. అప్పటినుంచి జగన్లో అనుమానాలు మరింత పెరిగాయి అన్న ప్రచారం సాగుతోంది.ఐక్యరాజ్యసమితి సమావేశాలకు బిజెపి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఏపీ నుంచి ఆ బృందంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కూడా ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నుంచి అభ్యంతరాలు వచ్చినా బిజెపి పెద్దలు మాత్రం మిధున్ రెడ్డిని ఎంపిక చేశారు.

## నవంబర్ నుంచి బంగారం తవ్వకాలు..

కర్నూలు, అక్టోబరు 10, రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును.. కరువుకు కేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారంలాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే.వానొస్తే కర్నూలు జిల్లా తుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది.జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ ? జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లో ట్రయల్ రన్ కొనసాగుతుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

## తలనొప్పిగా మారుతున్న తమ్ముళ్ల తన్నులాటలు

అనంతపురం, అక్టోబరు 10,ఉమ్మడి అనంతపురం జిల్లా లోని కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ అయినప్పటికీ నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరం , రాప్తాడు వంటి నియోజకవర్గాల్లో పార్టీ లోపలకే సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఇప్పటివరకు వీరి మధ్య అనుకున్నంత పెద్దగా సవాళ్లు కనిపించవు.తాజాగా రాయదుర్గం నియోజకవర్గంలో కాల్వ శ్రీనివాసులు పై పార్టీ లోపల విమర్శలు వినిపించాయి. శ్రీనివాసులు సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్నారు. తన రాజకీయ చరిత్రలో సౌమ్యుడనే పేరు తెచ్చుకున్నాడు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. తన సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, అన్ని వర్గాల వారిని కలుపుతూ ముందుకు వెళ్తూ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.కానీ, ఇటీవల ఆయనపై సొంత పార్టీలో కొన్ని విమర్శలు వచ్చాయి. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పాత ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికారపక్షం లోపలే విభేదాలు పెరుగుతున్నాయి.. ఇది స్థానిక రాజకీయ వాతావరణంలో టిడిపి నాయకులకు సవాలు గా మారింది. ఇక ఈ లక్షలు మరీ ఎక్కువ కావడంతో లోకల్ గా కూడా "ఎంతకాలం ఈ గొడవలు?" అనే విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో టిడిపి అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు కాస్త తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా కేవలం దూకుడే ఫలితాన్ని ఇవ్వదు. స్థానిక పరిస్థితులు, ప్రజల ఆలోచనలు, సమాజ మార్పులను అర్థం చేసుకుని నాయకులు సరైన వ్యూహాలను రూపొందించుకోవాలి. అలా కాకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.ఇక చంద్రబాబు నాయుడు ఈ సమస్యపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం కూడా వార్తల్లో వినిపిస్తోంది. కానీ, స్థానిక రాజకీయ దృష్ట్యా ఇది సరైన పరిణామం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలను సమర్థవంతంగా సర్దుమణిగే విధంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, స్థానిక స్థాయిలో సమైక్యత సాధించడానికి చర్యలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.మొత్తానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, సవాళ్లను సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు ఇప్పటి వరకు లేకపోవడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. టిడిపి నాయకులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలి అని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

## శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ మేడా మురళీధర్ కు ఘన సన్మానం

నంద్యాల నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఉమ్మడి జిల్లాల కర్నూలు నంద్యాల చార్టర్ గవర్నర్ బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థానం పాలక మండలి ధర్మకర్తగా నియమించబడిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ సీనియర్ బిజెపి నాయకులు మేడా మురళీధర్ అన్న కుఆయన కార్యాలయంలో ఘనంగాసన్మానించడమైనది.. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కండె శ్యాంసుందర్ లాల్,ఉపాధ్యక్షులు మల్లిపెద్ది నాగరాజు, బొగ్గరపు జనార్ధన్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, అదనపు ప్రధాన కార్యదర్శి ఆదవేణి మురళి,కార్యదర్శులు శివశంకర్,సుబ్బారావు, నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరకు శ్రీనివాస దత్తాత్రేయ, కార్యదర్శి సుబ్రమణ్యం,వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు మనోజ్,మోహన్,రంగయ్య, పొట్టిశ్రీరాములు క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి జనార్ధన్, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆఫీసర్ తాళ్లూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బరువు తగ్గలన్నా, డయాబెటిస్ కంట్రోల్ కావాలన్నా ఈ సీడ్స్ తినండి చాలు!





ఫ్లాక్స్ సీడ్స్.. ఈ మధ్యకాలంలో మన ఆరోగ్యానికి దోహదం చేసే గింజలలో ఒకటిగా వీటిని ప్రధానంగా సూచిస్తున్నారు. ఈ ఫ్లాక్స్ సీడ్స్ లో మన శరీరానికి కావలసిన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. చూడడానికి నల్లగా చిన్నగా ఉన్నప్పటికీ ఇవి మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజు మనం ఒక స్పూన్ ఫ్లాక్స్ సీడ్స్ ను తింటే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అవిసె గింజలతో హాయ్ కొలెస్ట్రాల్ కు చెక్ చాలామంది ఇటీవల హై కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. బాడ్ కొలెస్ట్రాల్ , ట్రై గ్లిజరైడ్ సమస్యతో బాధపడుతున్న వారికి అవిసె గింజలు ఎంతో బాగా ఉపయోగపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ తో గుండెజబ్బుల బారిన పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కొలెస్ట్రాల్ తగ్గడానికి ఈ గింజలను ఉపయోగిస్తే మంచిదని సూచిస్తున్నారు. నక్కతోక తొక్కినట్టు ఈ రాశులవారికి సంపదల వెల్లువ మొదలైందన్న బుధుడు! అవిసె గింజలతో దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షణ అవిసె గింజలలో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉండడం వల్ల అవిసె గింజలు కొలెస్ట్రాల్ సమస్యను తగ్గిస్తాయని చెబుతున్నారు. అంతేకాదు అవిసె గింజల్లో ఎక్కువగా ప్రోటీన్, ఫైబర్ ఉండడం వల్ల ఇవి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడంలో కూడా సహాయం చేస్తాయని చెబుతున్నారు. బరువు తగ్గాలన్నా బెస్ట్ ఆప్షన్ అవిసె గింజల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ప్రతిరోజు మనం రెండు స్పూన్ల అవిసె గింజలను తీసుకుంటే మన శరీరానికి కావలసిన ఫైబర్ చక్కగా అందుతుంది. ఇది మన జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేసి మలబద్ధకాన్ని నివారిస్తుంది.కళావతి, శరత్ మధ్య సంబంధం ఏమిటి..! 5 5 5 5 అవిసె గింజలతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఇక డయాబెటిస్ సమస్యలతో బాధపడేవారు ఫ్లాక్స్ సీడ్స్ తీసుకుంటే రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ అవుతాయి. ఈ సీడ్స్ లో ఉండే లిగ్నాన్స్ శరీరంలో క్యాన్సర్ కణాలను పెరగకుండా నిరోధిస్తాయి. మనకు పెద్ద పేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటాయి. తరచూ అవిసె గింజలను తినడం వల్ల జుట్టుకి ఆరోగ్యం చేకూరుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. మహిళలలో హార్మోన్ అసమతుల్యత తగ్గుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న అవిసె గింజలను తప్పనిసరిగా ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది.

# అసలు ఇడ్లీ ఎక్కడ నుంచి వచ్చిందో తెలుసా..?

డ్లీ అనే పదం వినగానే మన నోళ్ళలో నీరు వదలడం సహజం. మెత్తటి, తెల్లటి ఇడ్లీలు, చట్నీ, సాంబార్‌తో కలిపి మన భోజనాన్ని ఎంతో రుచికరంగా మారుస్తాయి. కానీ, ఈ రుచికరమైన ఆహారం ఎక్కడి నుంచి వచ్చిందో చాలా మందికి తెలియదు.ఇడ్లీల మూలాల గురించి ఖచ్చితమైన చారిత్రక ఆధారాలు లభించకపోయినా, అనేక పరిశోధనలు దక్షిణ భారతదేశం, ముఖ్యంగా తమిళనాడులో ఇడ్లీలు ఉద్భవించాయని సూచిస్తున్నాయి. సంస్కృతం, తమిళం వంటి పురాతన భాషలలోని గ్రంథాలలో ఇడ్లీల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. తమిళ సాహిత్యంలో ఇడ్లీలను 'ఇడలి' అని పిలుస్తారు. ఇడ్లీ తయారీకి ఉపయోగించే పదార్థాలు – అరటిపిండి, పప్పులు – ద్రావిడ సంస్కృతిలో ప్రధాన ఆహార పదార్థాలు.వ్యాపార మార్గాల ద్వారా ఇడ్లీలు దక్షిణ భారతదేశం నుంచి ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి.ఇడ్లీలు ప్రాంతం, రుచికి అనుగుణంగా వివిధ రకాలుగా తయారు చేస్తారు.ఉప్మా మిశ్రమంతో



తయారు చేసే ఇడ్లీలు.రవ్వతో తయారు చేసే ఇడ్లీలు.కర్ణాటకలో ప్రసిద్ధమైన, తీపి మరియు పులుపు రుచుల కలయికతో తయారు చేసే ఇడ్లీలు. ఏప్రిల్ తర్వాత హైదరాబాద్ నుంచి మీరు రాజమండ్రి, వైజాగ్ ఎలా వెళతారు? ఇడ్లీలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.ఇడ్లీలు మెత్తగా ఉండటం వల్ల జీర్ణం కావడానికి సులభంగా ఉంటాయి.పప్పులు ఉండటం వల్ల ఇడ్లీలు మంచి ప్రోటీన్ మూలం.గోధుమ పిండి ఉండదు కాబట్టి గ్లూటెన్ అలర్జీ ఉన్నవారు కూడా ఇడ్లీలు తినవచ్చు.ఇడ్లీలు భారతీయ వంటలలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించాయి. దక్షిణ భారతదేశంలో ఉద్భవించిన ఇడ్లీలు ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఇడ్లీలు రుచికరమైనవి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైనవి కూడా.

# బార్లీ నీళ్ళతో మీ బాడీలో మిరాకిల్స్ జరుగుతాయ్!

మన శరీరానికి పోషకాలు అందించే వాటిలో సహజసిద్ధమైన ఔషధం లాంటిది బార్లీ. బార్లీ శరీరంలోని వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందిస్తుంది . ఇందులో ఉండే పోషకాలు మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. బార్లీలో క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, రాగి, జింక్ వంటి ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. బార్లీ నీళ్ళతో బోలెడు హెల్త్ బెనిఫిట్స్ బార్లీ గింజలు గుండె జబ్బులు రాకుండా కాపాడుతాయి. మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. మన శరీరంలో అధిక మొత్తంలో ఉన్న నీటిని బార్లీ గింజలు తొలగిస్తాయి. మనకు మూత్ర సంబంధిత వ్యాధులు రాకుండా చేస్తాయి. బార్లీ గింజలను లేత గోధుమ వర్ణం వచ్చేవరకు వేయించుకొని పొడిచేసుకుని ఆ పొడిని మూడుకప్పుల నీళ్లలో రెండు చెంచాల మేర వేసి, ఉండలు కాకుండా కలిపి పది నిమిషాలు ఉడికించి చల్లార్చుకోవాలి. చిరంజీవి వల్లే నా కొడుకు హీరో అవలేదు... సినిమా ఆపించి కుట్ర చేశాడు బార్లీ నీళ్ళతో ఈ రోగాలకు చెక్ ఆ నీళ్ళను వడగట్టుకుని అందులో పావు గ్లాసు పలుచని మజ్జిగ చిటికెడు ఉప్పుతో కలిపి తీసుకుంటే బార్లీ నీళ్లు చాలా ప్రయోజనాలను ఇస్తాయి. డయాబెటిస్ పేషెంట్లకు బార్లీ నీళ్లు ఒక వరం లాంటిదని చెప్పవచ్చు. బార్లీ నీళ్లు తాగిన వారికి షుగర్ కంట్రోల్ లోకి వస్తుంది. ఇక బార్లీ నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన శరీరంలోని టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది . బార్లీ నీళ్ళు మంచి డిటాక్స్ డ్రింక్ బార్లీ నీళ్ళు మంచి డిటాక్స్ డ్రింక్ లాగా ఇది పనిచేస్తుంది. బార్లీ లోని యాంటీ ఆక్సిడెంట్లు అధిక బ్లడ్ షుగర్ లెవెల్స్ ను తగ్గిస్తాయి. అంతేకాదు బార్లీలో ఉండే టోకోఫెరోల్ అనే సమ్మేళనం మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ చేరకుండా రక్షణ నిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ చేసే శక్తి ఉన్న బార్లీ నీళ్ళకు బరువును తగ్గించే గుణం ఉంది. బార్లీ నీళ్లు తాగడం వల్ల బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.

# ఉదయాన్నే లేవగానే టీ తాగుతున్నారా? అయితే ఇవి తప్పక తెలుసుకోండి!

చాలా మంది ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే ముఖం కూడా కదగకుండా బెడ్ టీ లు తాగుతూ ఉంటారు. అది వాళ్లకు ప్రతీరోజూ ఒక అలవాటుగా ఉంటుంది. అయితే ఉదయం ముఖం కూడా కదగకుండా వేడి వేడి పొగలు కక్కే టీ తాగటం మంచిదేనా? అంటే మంచిది కాదని చెప్తున్నారు వైద్య నిపుణులు. ఇలా ప్రతీ రోజూ ఉదయాన్నే టీ తాగటం మన ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపిస్తుందని చెప్తున్నారు. ఖాళీ కడుపుతో టీ అస్సలు తాగకూడదు ఎవరూ పొరబాటున కూడా ఖాళీ కడుపుతో టీ అస్సలు తాగకూడదు. ఇది మన ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది . ఇలా టీ తాగటం కారణంగా గుండెల్లో మంట, ఎసిడిటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. టీ ఎక్కువగా తాగటం కారణంగా అనేక వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. టీ లో కెఫీన్ ఉంటుంది. ఉదయాన్నే లేవగానే టీ తాగితే దానిలో ఉన్న కెఫీన్ ప్రభావం మనపైన కచ్చితంగా ఉంటుంది.



ఏప్రిల్ తర్వాత హైదరాబాద్ నుంచి మీరు రాజమండ్రి, వైజాగ్ ఎలా వెళతారు? ఖాళీ కడుపుతో టీ తాగితే వచ్చే సమస్యలివే ఖాళీ కడుపుతో టీ తాగితే ఇది మన కడుపులోని ఆమ్లాన్ని పెంచుతుంది. అనేక జీర్ణ సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఉదయం నిద్రలేచిన తర్వాత ఒకటి లేదా రెండు గంటల తర్వాత టీ తాగితే దాని వల్ల ఎలాంటి సమస్యలు ఉండవు. అది శరీరానికి ఎలాంటి హాని చేయదు కానీ నిద్ర లేవటంతోనే టీ తో రోజును ప్రారంభిస్తే అది మన శరీరంపై ప్రభావాన్ని చూపిస్తుంది. టీ ఇలా తాగితే అస్సలు మంచిది కాదు ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల మీ పొట్ట బాగా చెడిపోతుంది. టీ తాగటం మంచిదే కానీ దానికి ఒక సమయం , ఒక పద్ధతి ఉంటుంది. సమయం ప్రకారం , పద్ధతి ప్రకారం టీ తాగితే ఇబ్బంది ఉండదు కానీ అదే పనిగా టీ తాగినా, ఉదయం లేచిన వెంటనే ఒక వ్యసనం మాదిరిగా టీ తాగినా ఇబ్బంది ఉంటుంది. కళావతి, శరత్ మధ్య సంబంధం ఏమిటి.వేడి టీ తాగటం మానుకోవాలి అంతే కాదు చాలా వేడి టీ ని కూడా తాగటం మానుకోవాలి. బాగా విపరీతమైన వేడి టీ ఒక వ్యసనంలా తాగితే అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కూడా చెప్తున్నారు. కనుక వేడి టీ విషయంలో తస్మాత్ జాగ్రత్త

# కళ్ళు ఆరోగ్యంగా ఉండాలా? అయితే ఇవి తినండి!




సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు. అటువంటి కళ్ళ ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం చాలా మంది కంటి సమస్యలతో బాధపడుతూ చిన్న వయసు నుండి కళ్ళజోళ్ళు వాడాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే కంటి ఆరోగ్యం కోసం మంచి ఆహారాలను తీసుకుంటే అటువంటి ఇబ్బందులు లేకుండా కళ్ళను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు అని డైటీషియన్లు చెబుతున్నారు. మరి కంటి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన ఆహారాల విషయానికి వస్తే.. క్యారెట్లు క్యారెట్లలో బీటా కెరోటిన్ ఉంటుంది. విటమిన్ ఏ తో కూడి ఉంటుంది. ఇది మన కంటి ఆరోగ్యాన్ని బాగా మెరుగుపరుస్తుంది. ప్రతి ఒక్కరూ తమ డైట్ ప్లాన్ లో క్యారెట్ లను చేర్చుకోవడం వల్ల రేచీకటి సమస్య నుంచి బయటపడతారు. దృష్టి సమస్యలు బాగా తగ్గుతాయి. ఏప్రిల్ తర్వాత హైదరాబాద్ నుంచి మీరు రాజమండ్రి, వైజాగ్ ఎలా వెళతారు? చేపలు చేపలలో ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ ఉంటాయి. చేపలు రెటీనా ఆరోగ్యానికి బాగా తోడ్పడతాయి. చేపలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. బచ్చలి కూర బచ్చల కూర వంటి ఆకుకూరలలో కంటి ఆరోగ్యానికి మేలు చేసే బోలెడు పోషకాలు ఉంటాయి. లుటీన్ మరియు జియాక్సంతిన్ వంటివి, కెరోటినాయిడ్స్ వంటివి బచ్చలకూరలో ఉండడం వల్ల ఇవి మన కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. గుడ్లు కోడిగుడ్లు జింక్ యొక్క అద్భుతమైన మూలం. ఇవి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి. జింక్ విటమిన్ ఏ ను కాలేయం నుండి రెటీనాకు రవాణా చేయడంలో సహాయపడుతుంది. కనుక గుడ్లు కంటి ఆరోగ్యానికి దోహదం చేస్తాయి'చద్దన్నం తింటున్నారా? ముందు ఇది తెలుసుకోండి!" బ్లూ బెర్రీస్ కళ్ళు ఆరోగ్యంగా ఉండాలనుకునేవారు బ్లూ బెర్రీస్ ని కూడా తీసుకుంటే మంచిది. ఇందులో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఒత్తిడిని అలసటను తగ్గించడానికి సహాయపడతాయి. ఇది కంటిలోని సున్నితమైన రక్తనాళాలను కాపాడతాయి. మీ ఆహారంలో బ్లూ బెర్రీస్ ను భాగం చేసుకుంటే మంచిది. బ్రోకలీ బ్రోకలీ అనేది విటమిన్ సి, లుటిన్,జియాక్సంతిన్ మరియు బీటా కెరోటిన్ యొక్క పోషకాలతో ఇది కంటి ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుంది. దృష్టి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని బ్రోకలీ తగ్గిస్తుంది. చిలకడదుంపలు చిలకడదుంపలు బీటా కెరోటిన్ యొక్క అద్భుతమైన మూలం. ఇది మన కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. చిలకడదుంపలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అవసరమైన పోషకాహారం అందించినట్టు అవుతుంది. ఇది కంటి సమస్యలను బాగా తగ్గిస్తుంది. ఒతినెవ " హెయిర్ ఫాల్ బాధి ,స్తుందా? ఈ ఆహారాలతో జుట్టు రాలటం తగ్గుతుంది!" బాదం పప్పు ఇక బాదంపప్పులో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. బాదం పప్పును ఆహారం లో భాగంగా తీసుకోవడం వల్ల కూడా బోలెడు ఆరోగ్య ప్రయో జనాలు కలుగుతాయి. దృష్టిలోపాలు తగ్గి కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# చద్దన్నం తింటున్నారా? ముందు ఇది తెలుసుకోండి!

మన పూర్వీకులు సూర్యోదయానికి ముందే లేచి కాలకృత్యాలు తీర్చుకొని చద్దన్నం తిని పనికి వెళ్లేవారు. మధ్యాహ్నం అన్నం తిన్నతర్వాత సూర్యాస్తమయం లోపు సాయంత్రం భోజనం తినేవారు. వారు ఎన్ని తిన్నా ఉదయం తిన్న చద్దన్నం అమితమైన శక్తిని అందించేది. ప్రస్తుతం మనమంతా చద్దన్నమా? అంటూ చాలా తేలికగా చూస్తున్నాం. అది అమృతంతో సమానం. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. రోజంతా శరీరం శక్తితో ఉండేలా చూస్తుంది. అటువంటి చద్దన్నాన్ని ఇప్పుడిప్పుడే అందరూ మళ్లీ తినడం ప్రారంభిస్తున్నారు. దాన్ని ఎలా తయారు చేస్తారు? దాని వల్ల ప్రయోజనాలను తెలుసుకుందాం. చద్దన్నం తయారీకి కావాల్సిన పదార్థాలు అన్నం (ఒకటిన్నర కప్పులు) వేడి నీరు (ఒక కప్పు) పాలు (ఒక కప్పు) మజ్జిగ (మూడు టేబుల్ స్పూన్లు) ఉల్లిపాయ (1) పచ్చిమిర్చి (కొన్ని) ఉప్పు (రుచికి తగినంత) జూనియర్ ఎన్టీఆర్‌ను ఫంక్షన్‌కు పిలిచి అవమానించిన స్టార్ హీరో తయారుచేసే విధానం అన్నం మరిగించుకోవడం... ముందుగా అన్నాన్ని బాగా ఉడికించుకోవాలి. మెత్తగా ఉడికించిన అన్నం చద్దన్నానికి మంచి రుచినిస్తుంది. అన్నం, నీరు, పాలు కలపడం... ఉడికించిన అన్నాన్ని ఒక పాత్రలో తీసుకొని, దానిలో వేడి నీరు, పాలు కలిపి బాగా కలపాలి. వేడి తగ్గించి మజ్జిగ వేయడం... ఈ మిశ్రమం వేడి తగ్గిన తర్వాత దానిలో మజ్జిగ వేసి మళ్ళీ బాగా కలపాలి. మజ్జిగకు బదులు పెరుగు వాడొచ్చు కానీ, మజ్జిగ వల్ల చద్దన్నం మరింత రుచికరంగా ఉంటుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేయడం... ఉల్లిపాయను పెద్ద ముక్కలుగా, పచ్చిమిర్చిని రెండు ముక్కలుగా కట్ చేసి ఈ మిశ్రమంలో వేయాలి. ఉప్పు వేసి కలపడం... చివరగా రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి మూత పెట్టి రాత్రి మొత్తం అలాగే ఉంచాలి. తర్వాత రోజు ఉదయం చద్దన్నం తయారై ఉంటుంది. దీన్ని రుచికరంగా తినొచ్చు.కళావతి, శరత్ మధ్య సంబంధం ఏమిటి..! 5 ఆరోగ్య ప్రయోజనాలు జీర్ణవ్యవస్థకు మంచిది... చద్దన్నంలో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. వేసవిలో చల్లదనాన్ని ఇస్తుంది... వేసవి కాలంలో చద్దన్నం శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది... చద్దన్నం త్వరగా



జీర్ణమవుతుంది, కేలరీలు తక్కువగా ఉంటాయి. మధుమేహం నియంత్రణకు సహాయపడుతుంది... చద్దన్నం బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. చద్దన్నాన్ని మట్టి కుండలో తయారు చేస్తే మరింత రుచి వస్తుంది. దీన్ని పచ్చడి, పెరుగు వంటివి కలిపి తింటే రుచి పెరుగుతుంది. చద్దన్నంలో కొద్దిగా కరివేపాకు, కొత్తిమీర వంటివి వేసి తయారు చేయొచ్చు. ఉదయం నిద్ర లేవగానే తినేయాలి. దీన్ని తయారుచేసేటప్పుడు ఎంతో పరిశుభ్రత పాటించాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం.




# త్రివిక్రమ్-వెంకీ కాంబో

## హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్








నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోత ˇన్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ఎ÷-లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీమేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.



# మోహన్ లాల్ చిత్ర రికార్డులు బ్రేక్

## 300 కోట్లు వసూలు చేసని కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాస్తోంది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 300 కోట్ల క్లబ్‌లో చేరినట్లు టాక్. విడుదలైన నెల రోజులకే ఓటీటీకి వచ్చేస్తున్న తరుణంలో 'కొత్తలోక' మాత్రం ఇంకా థియేటర్‌లోనే ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్రలో డొమినిక్ అరుణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. కేవలం రూ.30 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ మూవీ విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన 'ఎల్2: ఎంపురాన్' ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును 'కొత్తలోక' బద్దలు కొట్టింది. వీటి తర్వాత 'తుడురమ్' రూ.242 కోట్లతో మూడో స్థానంలో ఉంది. డొమినిక్ అరుణ్ కథను నమ్మి నటుడు దుల్కర్ సల్మాన్ పెద్ద సాహసం చేశాడు. 'కొత్తలోక' నటీనటులు, సాంకేతిక వర్గంపై రూ.30 కోట్లు ఖర్చు చేయడం చూస్తే, దుల్కర్ ఆ కథను ఎంతగా నమ్మాడో అర్థమవుతుంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్రబృందం కష్టపడింది. ఇప్పటివరకూ కల్యాణి ప్రియదర్శన్ నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా కథ, కథనాలు వైవిధ్యంగా ఉండటంతో కేవలం మౌత్ టాక్‌తోనే దూసుకుపోయింది. ఇప్పుడు ఏకంగా మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.




ఇక ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడొస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబరు 20వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు 'లోక' యూనివర్స్ కొనసాగుతుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులోభాగంగా 'లోక: చాప్టర్2'ను నిర్మాత దుల్కర్ సల్మాన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.

# బద్రీనాథ్‌తో 40కో-టుల బొక్క: అల్లు అరవింద్




అల్లు అర్జున్ ఇప్పుడు ఐకాన్ స్టార్ గా ఇండియా రేంజ్ లో దూసుకుపోతున్నాడు. పుష్ప సినిమా తర్వాత ఆయనకు పాన్ ఇండియా మార్కెట్ బాగా పెరిగింది. వందల కోట్ల బిజినెస్ చేస్తోంది ఆయన సినిమా. అయితే ఈ స్థాయిలో బన్నీ సినిమాలు చేస్తుంటే.. ఆయన వల్ల అల్లు అరవింద్ 40 కోట్లు నష్టపోయాడు. బద్రీనాథ్ మూవీ విషయాన్ని అల్లు అరవింద్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. అల్లు అర్జున్ హీరోగా వివి వినాయక్ డైరెక్షన్లో వచ్చిన భారీ బ్జడెట్ మూవీ బద్రీనాథ్. అయితే ఈ సినిమాను ముందు అల్లు అరవింద్ రిజెక్ట్ చేశాడంట. కానీ అల్లు అర్జున్ ఇందులోని యాక్షన్ సీన్స్ కోసం పట్టుబట్టి మరి చేశాడు. ఈ సినిమా రిజల్ట్ ఎందుకో తేడా కొడుతుందని ముందు నుంచి అరవింద్ చెబుతూనే ఉన్నాడంట. సినిమాకు బ్జడెట్ అనుకున్న దానికంటే రెండింతలు ఎక్కువైంది. అప్పుడున్న బన్నీ మార్కెట్ కుమించి బ్జడెట్ అయింది. రిలీజ్ కి ముందు కూడా అరవింద్ కు ఈ సినిమా గురించి తేడాగానే ఉందని అనిపించింది. అనుకున్నట్టు గానే సినిమా డిజాస్టర్ అయింది. బ్జడెట్ భారీగా ఉండడంతో నష్టాలు ఎక్కువగానే వచ్చాయి. ఆ సినిమాకు ఎంత లేదన్న 40 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని అల్లు అరవింద్ స్వయంగా తెలిపాడు. ఆ దెబ్బతోనే చాలా రోజులు పెద్ద సినిమాలు నిర్మించలేదని స్పష్టం చేశాడు. తిరిగి కోలుకోవడానికి కొంచెం టైం పట్టిందని.. కెరీర్ లో ఇలాంటి అనుభవాలు కూడా మంచివే అంటూ తెలిపాడు అరవింద్.

# అప్పట్లో రామ్‌గోపాల్ వర్మ అంటే ఎవరో తెలీదు

## శివ సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపిందన్న శేఖర్ కమ్ముల



ఇండస్ట్రీని 'శివ' సినిమాకు ముందు తర్వాత అని చూడొచ్చని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివ' మరోసారి అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసందే. నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో తనకు తెలియదన్నారు. టాలీవుడ్ చరిత్రలో మలుపుతిప్పిన సినిమాగా గుర్తింపు పొందింది 'శివ'. నాగార్జున హీరోగా, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపింది. 1989లో విడుదలైన ఈ సినిమా, సాంకేతికంగా, కథా పద్ధతిలో, మేకింగ్‌లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. యాక్షన్ చిత్రాలకే కాదు, కాలేజీ డ్రామాలకు కూడా రియలిస్టిక్ టచ్ ఇచ్చిన మొదటి తెలుగు సినిమా ఇది అని సినీ అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు ఈ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 14న 'శివ' రీ-రిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని గురించి తన భావాలను పంచుకున్నారు. 'అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో నాకు తెలియదు. కానీ 'శివ' సినిమా చూశాక సినిమా అంటే ఏమిటో, దాన్ని ఎలా ఆలోచించాలో అర్థమైంది. ఆ సినిమా నా దృష్టి, నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది' అంటూ కమ్ముల పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఆ సినిమాకు ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన శేఖర్ కమ్ముల దృష్టిలో 'శివ' కేవలం ఒక సినిమా కాదు, అది ఒక పాఠశాల లాంటిదట. ఈ సినిమా ప్రభావం తన దర్శకత్వ శైలిలో కూడా కనిపిస్తుందని తెలిపారు.




# ప్రేమంటే మూవీ నుంచి దోచావే పాట విడుదల

ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'దోచావే నన్నే నువ్విలా..' అనే పాటను విడుదల చేశారు. ఈమెలోడీ పాటకు శ్రీమణి లిరిక్స్ అందించారు.



# బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నందికొట్కూరు అక్టోబర్ 10:-ఆర్థిక ఇబ్బంది ఉన్నా అనారోగ్యంతో భాధపడి ఆసుపత్రి లో చికిత్స తీసుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.శుక్రవారం నంద్యాల బొమ్మలసత్రంలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామానికి చెందిన గజ్జల నాగశేషులుకు మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.8.50 లక్షల చెక్కును భాధితుడికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్సున్న మారాజు అని, పేద రోగులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తూ అండగా ఉంటున్నారని,భాధితులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతులుగా ఉండాలని ఆమె కోరారు.

## అక్టోబర్ 15 న జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణ,మండల కేంద్రాల్లో గో బ్యాక్ ప్రధాని నరేంద్ర మోడీ అనే పేరుతో నల్ల జెండాలతో నిరసన ర్యాలీ లు నిర్వహించాలి




జీఎస్టీ విజయోత్సవాల పేరుతో ప్రచారం చేసుకోవడానికి అక్టోబర్ 16 న కర్నూలు నగరంలో ప్రధాని నరేంద్ర మోడీ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటిస్తున్నారు.ఈ సందర్భంగా భారీ ఎత్తున సభ నిర్వహిస్తున్నారు.రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండ రాష్ట్రానికి ప్రత్యేక హోదా,వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఇవ్వకుండ,కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండ, విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ ఆపకుండ తీరని అన్యాయం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి కర్నూలు లో పర్యటించే నైతిక హక్కు లేదని గో బ్యాక్ ప్రధాని నరేంద్ర మోడీ అని 15 వ తేదీ నాడు కర్నూలు నగరం తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నల్ల జెండాలతో నిరసన ర్యాలీలు నిర్వహించాలని అక్టోబర్ 9వ తేదీ న సి.ఆర్.భవన్ కర్నూలు నందు జరిగిన వామపక్ష పార్టీల సమావేశం కలిసి వచ్చిన విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని విద్యార్థి కార్యదర్శులు చొరవ చేసి అన్ని ప్రాంతాల్లో వామపక్ష పార్టీల నాయకులతో మాట్లాడి కార్యక్రమాన్ని రూపొందించుకొని ఎక్కువ మందిని సమీకరించి భారీ ఎత్తున నిరసన ర్యాలీ లు నిర్వహించాల్సిందిగా కోరుతున్నాము. అభివందనాలతో, × సి శివ × ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి × పత్తికొండ×

## నంద్యాల జిల్లా ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నందికొట్కూరు అక్టోబర్ 10:-ఈ నెల 16 వ తేదీ నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్య క్షేత్రంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనపై నంద్యాల జిల్లా ఎస్పీ ని సునీల్ షేరాన్ తో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి చర్చించారు.శుక్రవారం నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిచారు.భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శ్రీశైలం పర్యటన విజయవంతం చేసేందుకు చర్చించారు. నంద్యాల జిల్లాలోని కొన్ని సమస్యలు కూడా జిల్లా ఎస్పీ దృష్టికీ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తీసుకెళ్లారు.



# బట్ట మేక పక్షి పరిరక్షణ కార్యక్రమం.మాండ్రా లింగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం




నందికొట్కూరు అక్టోబర్ 10 :మిద్దురు మండలం రోళ్లపాడు గ్రామంలో సొసైటీ బస్టర్డ్ రికవరీ ప్రోగ్రామ్ ప్రెసిడెంట్ మాండ్ర లింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి బస్టర్డ్ రికవరీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ,నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య,బి న్ హెచ్ స్ డాక్టర్ సుజిత్ నర్వాడే, రాజగిరి పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ఈ బట్ట మేక పక్షి ప్రపంచంలోనే పేరుగాంచిన అరుదైన పక్షి అని ఈ పక్షి రోలపాడు గ్రామాలలో ఉండడం గర్వించదగ్గ విషయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు.నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ ఈ బట్ట మేక పక్షి ఎత్తు రెండు మీటర్లు ఉంటుందని ఈ పక్షి అవశ్యకత గురించి చెప్పాలంటే ఈ పక్షి సంవత్సరానికి ఒక గుడ్డు మాత్రమే పెడుతుందని ఆ గుడ్డుకు ఏమాత్రం ఆటకం కలిగిన ఆ గుడ్డును తాకిన పిల్లలను లేపాదు కాబట్టి ఆ గుడ్డును జాగ్రత్తగా పరీక్షించడం బాధ్యత అందరి పైన ఉంటుందని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి,కడియం వెంకటేశ్వర్లు యాదవ్,సర్వోతం రెడ్డి, స్వామి రెడ్డి,సుధాకర్ రెడ్డి, శివరామి రెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ యాదవ్,కన్వీనర్ మోహన్ రెడ్డి మరియు గ్రామ రైతులు,మండల అధికారులు పాల్గొన్నారు.

# స్టాల్ ఇన్ మాల్‌తో గ్రామీణ హస్తకళాకారులకు చేయూత

## స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం
## పట్టణ ప్రాంత ప్రజల అభిరుచులకు తగ్గట్లు అందుబాటులో ఉత్పత్తులు
## జనవరి 9 వరకు స్టాల్ ఇన్ మాల్ ద్వారా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు
## నగర ప్రజలు హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలి
## నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా

విజయవాడ,అక్టోబర్ 10: స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్‌లోనూ స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) ఎంఎం బెహ్రా అన్నారు. ఁబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను శుక్రవారం నాబార్డ్ నాబార్డ్ డీజీఎం ఎంఎం బెహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటి ప్రదర్శన, అమ్మకాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి సత్ఫలితాలనిచ్చాయన్నారు.

ప్రస్తుతం ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శన జనవరి 9 వరకు ఉంటుందని.. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారన్నారు. పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను తిలకించి స్వయం సహాయక బృందాల మహిళల ఆర్థిక పురోగతికి చేస్తున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎం బెహ్రా కోరారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో విశాఖపట్నం, విజయవాడ పట్టణాలలో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ప్రదర్శన 90 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు 15 రోజులపాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలకు గ్రామీణ హస్తకళారూపాలను తయారీ ధరలకే అందించాలనే లక్ష్యంతో పాటు కళాకారులకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కల్లేష్, నేస్తం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, గ్రామీణ హస్తకళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నోబెల్ శాంతి పురస్కార ఎంపికలో లోపాలు

## రాజకీయ వివక్ష చూపారని వైట్‌హౌజ్ విమర్శలు

వాషింగ్టన్,అక్టోబర్ 10: నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల నెరవేరలేదు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారానికి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనాను ఎంపిక చేసినట్లు శుక్రవారం అకాడమీప్రకటించింది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం స్పందించింది. ఈ పురస్కార విజేత ఎంపికలో రాజకీయ వివక్ష చూపించారని విమర్శించింది.తాజా పరిణామాలపై వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చుయెంగ్ మాట్లాడారు. 'నోబెల్ కమిటీ మరోసారి శాంతి స్థాపన కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రపంచ శాంతి కోసం నిజమైన నిబద్ధత చూపించిన వారిని పక్కనబెట్టి రాజకీయ వివక్షను ప్రదర్శించింది. అయినప్పటికీ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను ఆపేందుకు తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు. శాంతి ఒప్పందాలతో ప్రాణాలు నిలబెడుతారు. ఆయన మానవతావాది. తన సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించే ఆయనలాంటి వ్యక్తి మరొకరు ఉండరని చుయెంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అటు ట్రంప్‌నకు మద్దతిచ్చే 'మాగా వాయిస్' కూడా తన ఎక్స్ ఖాతాలో దీనిపై స్పందించింది. నోబెల్ శాంతి బహుమతి ఓ జోక్‌గా మారింది. తెలివి ఉన్నవారు ఎవరైనా ట్రంప్‌నకే నోబెల్ రావాల్సిందని అనుకుంటారని విమర్శలు గుప్పించింది. ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కల ఈనాటిది కాదు. గతంలోనూ చాలా సార్లు ఆయన తన ఆకాంక్షను బయటపెట్టారు. అయిత, రెండోదఫా అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు నోబెల్ వచ్చి తీరాల్సిందే అన్న స్థాయిలో ప్రచారం చేసుకున్నారు. ఎన్నో యుద్ధాలను ఆపానని, ప్రపంచ శాంతిని కోరుకుంటున్న తనకు ఇచ్చి తీరాల్సిందేనంటూ బహిరంగ ప్రకటనలు ఇచ్చారు. తాను ఎన్ని మంచి పనులు చేసినా.. నోబెల్ మాత్రం ఇవ్వరంటూ ఓ సందర్భంలో అక్కసు కూడా వెళ్లగక్కారు. అయితే, ట్రంప్ మాటలను నోబెల్ అకాడమీ పరిగణనలోకి తీసుకోలేదు.

# ప్రధాన మంత్రి వర్యుల పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయండి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, అక్టోబర్ 10: ప్రధాన మంత్రి వర్యుల పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు..గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న రాగమయూరి వద్ద పార్కింగ్, హెలిప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు..ఈ సందర్భంగా కలెక్టర్ హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తూ హెలిప్యాడ్ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు.... టాయిలెట్ ల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు...రోడ్డు పై ఉన్న డివైడర్ ల దగ్గర ప్లాంటేషన్ పనుల గురించి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు.... పారిశుధ్యం పనులు బాగా జరగాలని, పారిశుధ్యం పనులలో ఎక్కడ కూడా నిర్లక్ష్యం కనపడకూడదని కలెక్టర్ డీపీఓ ను ఆదేశించారు...ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ముఖ్యంగా శుభ్రత, తాగునీటి సదుపాయాలు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.. సభ ప్రాంగణం వద్ద చేస్తున్న ఏర్పాట్ల గురించి కలెక్టర్ మాన్ సంస్థ ప్రతినిధులను ఆరా తీసి పలు సూచనలు ఇచ్చారు..జిల్లా కలెక్టర్ గారి వెంట ఎంఎల్ సి బిటి నాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇంచార్జి జ్యోతి, డి సి ఎం ఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు..

# సిఐ విధులకు ఆటంకం

## మాజీమంత్రి పేర్నినానిపై చర్యలు: ఎస్పీ

మచిలీపట్నం,అక్టోబర్ 10: ఆర్‌పేట సీఐపై మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని నాని వ్యవహరించిన తీరుపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన పేర్ని నానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల మెడికల్ కాలేజీవద్ద జరిగిన నిరసన కేసులో కొంత మందికి నోటీసులు ఇచ్చి విచారిస్తున్నాం. అందులో భాగంగా ఏ8గా ఉన్న మేకల సుబ్బన్నను కూడా స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నాం. ఆ సమయంలో పేర్ని నాని.. వైకాపా కార్యకర్తలతో కలిసి స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌హెచ్‌వో ఛాంబర్‌లోకి వచ్చి విచారణ అధికారి అయిన సీఐను బెదిరించేలా మాట్లాడారు. దీన్ని పోలీస్ శాఖ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఐ విధులకు ఆటంక పరచడమే కాకుండా దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదు. పోలీస్ స్టేషన్‌కు రావడంలో తప్పులేదు. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చు. అంతేగానీ, విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తిని విడిపించుకొని వెళ్లిపోతా అనడం సరికాదు. పోలీసులతో మాట్లాడేటప్పుడు గౌరవంగా మాట్లాడాలి. మేం కూడా అదే గౌరవంతో మాట్లాడుతాం. గ్రూపులుగా వచ్చి గలాటా సృష్టించడం మంచి పద్ధతి కాదు. దీనిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ తెలిపారు.

# నోబెల్ శాంతి బహుమతి ట్రంప్‌కు అంకితం

## తమ పోరాటానికి దన్నుగా నిలబడ్డందుకు కృతజ్ఞతలు
## నోబెల్ పురస్కారం పొందిన వెనిజులా నాయిక మరియా కొరీనా మచాడో

న్యూఢిల్లీ,అక్టోబర్ 10: ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతినిఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అంకితం ఇస్తున్నట్లు వెనిజులా పోరాటయోధురాలు మరియా కొరీనా మచాడో ప్రకటించారు. ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు వెనెజువెలా హక్కుల కార్యకర్త మరియా కొరీనా మచాడోను ఈ పురస్కారం వరించింది. దీనిపై తాజాగా మచాడో తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ.. ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారాన్ని వెనెజువెలా ప్రజలతోపాటు తమ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తోన్న డొనాల్డ్ ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నానని చెప్పారు. వెనెజువెలా ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించడం మా పోరాటం ముగింపునకు ఊతమిస్తుంది. స్వేచ్ఛ పొందేందుకు దోహదపడుతుంది. విజయానికి దగ్గరలో ఉన్నాం. గతంలో లేనంతగా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలపై ఆధారపడతాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు ప్రధాన మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్ణయాత్మక మద్దతు ఇస్తున్న అధ్యక్షుడు ట్రంప్‌నకు అంకితం చేస్తున్నా అని మరియా పేర్కొన్నారు. అంతకుముందు నార్వే నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బ్రెగ్ హార్ప్‌క్వెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

శాంతి పురస్కారాన్ని ఇవ్వనున్న విషయాన్ని ఆమెకు ముందుగానే తెలియజేశారు. నాకు ఈ పురస్కారం రావడం నమ్మలేకపోతున్నా. మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం అని మీరు అర్థం చేసుకున్నారని భావిస్తున్నా. అయితే, ఇది నా ఒక్కరి గెలుపు కాదు. వ్యక్తిగతంగా నేను దీనికి అర్హురాలిని కాదని అనుకుంటున్నా. ఇది సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు అని మరియా కొరీనా పేర్కొన్నారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది కాలంగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది.

